క్లుప్తంగా

ఆక్రమణలను మరోసారి అడ్డుకున్న అధికారులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ వీవీ నరసరాజు రోడ్డులో బుధవారం రాత్రి ఆక్రమణదారులు మరోసారి దేవాలయాల పేరిట ఆక్రమణలకు పాల్పడ్డారు. దీంతో గురువారం తెల్లవారుజామున టౌన్ ప్లానింగ్, ఇరిగేషన్ సిబ్బంది పోలీసులతో కలిసి ఆక్రమణలను తొలగింపు చర్యలు చేపట్టారు. దీంతో ఆక్రమణదారులు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. పెద్ద సంఖ్యలో అధికారులు పోలీసులు రావటంతో ఆక్రమణదారులు వెనుకడుగు వేశారు. ఇక్కడ నూతనంగా వెలసిన రెండు ఆలయాలతో పాటు, శ్రీకృష్ణ మందిరం వద్ద గోశాల, స్క్రాప్‌లను తొలగించారు. మరోమారు ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. అలాగే ఆక్రమణలకు పాల్పడకుండా కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు చేపట్టారు.

విధులకు ఆటంకం కలిగించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విధి నిర్వహణలో తమను అడ్డుకోవటంతో పాటు దురుసుగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ గురువారం 209వ వార్డు ప్లానింగ్ సెక్రటరీ డి.శ్రీకాంత్ గురువారం గుణదల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మధురాగనర్ వీవీ నరసరాజు రోడ్డులో ఆలయాల పేరిట ఆక్రమించిన ఆక్రమణలను వివిధ శాఖల అధికారులతో కలిసి తొలగింపు పనులు చేపట్టారు. దీంతో కొంత మంది ఆక్రమణదారులు సిబ్బందిని విధులు చేయకుండా అడ్డుకోవటంతో పాటు దుర్భాషలాడారు. దీంతో గురువారం శ్రీకాంత్ గుణదల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముస్లిం మైనార్టీల హక్కుల సాధనకు పోరాడాలి



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ముస్లిం మైనార్టీల హక్కుల సాధన కోసం పోరాటాలు చేసేందుకు ఆజాద్ ముస్లిం కమిటీ(ఏఎంసీ) సభ్యులంతా సిద్ధంగా ఉండాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ జాయింట్ సెక్రటరీ, ఆ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా పిలుపునిచ్చారు. ఏఎంసీ 57 వ డివిజన్ అధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో న్యూరాజరాజేశ్వరిపేటకు చెందిన షేక్ కరీమా అనే పేద ముస్లిం మహిళకు గురువారం తోపుడు బండిని అందజేశారు. ప్రతి నెలా సేవా కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నామన్నారు. ఏఎంసీ సభ్యులు షేక్ సాజిద్ అలీ, ఎండీ కాలేషా, సయ్యద్ మౌలాలి, షేక్ మస్తాన్, బిలాల్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

టాటా మోటార్స్ దేశ్ కా ట్రక్ ఉత్సవ్‌ను ప్రారంభం

భవానీపురం(విజయవాడపశ్చిమ): వాహనాల తయారీలో అగ్రగామిగా ప్రసిద్ధి చెందిన టాటా మోటార్స్, స్థానిక డీలర్ జాస్పర్ ఇండస్ట్రీస్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం విజయవాడలోని స్టెల్లా కళాశాల ఇండోర్ స్టేడియంలో 'దేశ్ కా ట్రక్ ఉత్సవ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఏపీ లారీ ఓనర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ వైవీ ఈశ్వరరావు, కృష్ణాజిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నాగమోతు రాజా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో టాటా మోటార్స్ ఏరియా మేనేజర్ ఎస్.భరణిధరన్, టెరిటరీ సేల్స్ మేనేజర్ ప్రసాద్, స్టేట్ సర్వీస్ హెడ్ ఎల్.రాజేంద్ర ప్రసాద్, జాస్పర్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ పీబీ సత్యనారాయణరావు, టాటా కంపెనీ ప్రతినిధులు, కస్టమర్స్, ఫైనాన్షియర్స్ తదితరులు పాల్గొన్నారు.

జ్యోత్స్న ఆశయాలను కొనసాగిద్దాం



కృష్ణలంక(విజయవాడతూర్పు): స్త్రీ, పురుష సమానత్వం కోసం సేఫ్ సంస్థ వ్యవస్థాపకురాలు జ్యోత్స్న ఎంతో కృషి చేశారని, ఎన్నో సమాజ సేవా కార్యక్రమాలను నిరంతరం నిర్వహించారని, ఆమె ఆశయాలను కొనసాగిద్దామని పలువురు వక్తలు అన్నారు. రాఘవయ్య పార్కు సమీపంలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో తరుణీ తరంగాలు, ఎం.బి.విజ్ఞాన కేంద్రం, అమరావతి బాలోత్సవం, సేఫ్, ఐద్వా, ఎస్ఎఫ్‌డబ్ల్యు, పీఓడబ్ల్యూ, ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, జన శిక్షణ సంస్థాన్, స్పృహాప్తి ఆర్గనైజేషన్, భారత మహిళామండలి, నిర్భయ క్రాంతి మహిళా మండలి సంయుక్త ఆధ్వర్యంలో గురువారం జ్యోత్స్న జ్ఞాపకల పేరుతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోత్స్న చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఐద్వా జాతీయ నాయకురాలు ఎస్.పుణ్యవతి, అమరావతి బాలోత్సవ్ కార్యదర్శి ఆర్.కొండలరావు, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి తదితరులు మాట్లాడుతూ.. జ్యోత్స్న మన మధ్య లేకపోయినా ఆమె సేవలను స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలను నిర్వహించాలని పిలుపునిచ్చారు. తరుణీ తరంగాలు అధ్యక్షురాలు రావి శారద, ఎంబి విజ్ఞాన కేంద్రం కార్యదర్శి పి.మురళీకృష్ణ, వివిధ మహిళా సంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు.



దావు బుచ్చయ్యకాలనీలో ఖాళీ స్థలాల్లో నిల్వ ఉన్న వర్షపునీరు



వినాయకనగర్‌లో..

చెరువులను తలపిస్తున్న
ఖాళీ స్థలాలు

- దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్న వైనం
- రోగాల బారిన పడుతున్న ప్రజానీకం
- చర్యలు తీసుకోవాలని స్థానికుల వినతి

మధురానగర్(విజయవాడసెంట్రల్): 30వ డివిజన్ జీవీఆర్‌నగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయనగర్‌లో ఖాళీ స్థలాలు చెరువులను తలపిస్తున్నాయి. బుడమేరు వరద నీరు, స్థానికులు వాడిన మురుగు, వర్షపు నీరు ఖాళీ స్థలాల్లో నిలిచిపోయాయి. ఇక్కడ మురుగునీరు బయటకు పోయే మార్గం లేకపోవటంతో ఖాళీస్థలాలు మురుగు, వర్షపు నీటితో నిండిపోయాయి. దీంతో ఖాళీ స్థలాలు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మరాయి. ఇటీవల వచ్చిన బుడమేరు వరద నీరు సైతం ఇక్కడ పూర్తిగా తొలగిపోలేదు. అధికారులు కనీసం ఇక్కడ వరద నీటిని బయటకు పంపేందుకు అవసరమైన కనీస చర్యలు కూడా చేపట్టకపోవటం గమనార్హం. నీరు నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతుండటంతో అంటువ్యాధులు ప్రబలుతాయేమోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఏపుగా పెరిగిన జమ్ము

విజృంభిస్తున్న దోమలు

ఖాళీ స్థలాల్లో నీరు నిలిచిపోవటంతో దోమలు విజృంభిస్తున్నాయి. చీకటి పడితే దోమల వల్ల నానాయాతన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. దోమల నివారణ చేపట్టాల్సిన అధికారులు తూతూమంత్రంగా గంబూసియా చేపలు, ఆయిల్ బాల్స్ వేసి చేతులు దులుపుకుంటున్నారన్నారు. కానీ నిలిచిన నీటిని బయటకు పంపేందుకు కనీస చర్యలు తీసుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము ఎన్ని జాగ్రత్తలు పాటిస్తున్నప్పటికీ దోమల వల్ల తిప్పలు తప్పటం లేదని చెబుతున్నారు. దోమల వల్ల తరచూ అనారోగ్యం బారిన పడి, ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నామంటున్నారు. అధికారులు స్పందించి దోమల నివారణ చర్యలు వేగవంతం చేయటంతో పాటు ఖాళీ స్థలాల్లో నీటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కలవరపెడుతున్న విష సర్పాలు

ఖాళీ స్థలాలో నీరు నిలిచిపోవటంతో పాటు పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. దీంతో విషసర్పాల సంచారం అధికమైందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విషసర్పాల వల్ల రాత్రి పూట బయటకు రావాలంటేనే భయమేస్తుందని వాపోతున్నారు.

జ్వరాల బారిన పడుతున్నాం..



మా ప్రాంతంలో 365 రోజులు ఇళ్ల చుట్టూ నీరు నిలిచే ఉంటుంది. దీంతో ఎంతో కష్టపడి నిర్మించుకున్న భవనానికి భద్రత లేకుండా పోయింది. అలాగే నీటి నిల్వ వల్ల దోమలు విజృంభిస్తున్నాయి. దోమల వల్ల జ్వరాల బారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నాం. అధికారులు వెంటనే స్పందించి ఖాళీ స్థలాల్లో నీటిని తొలగించడంతో పాటు దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

– దామర్ల బాబూరావు, స్థానికుడు, దావు బుచ్చయ్యకాలనీ

అధికారులు చర్యలు తీసుకోవాలి..



ఇక్కడ వర్షపు నీరు, మురుగు బయటకు పోయే మార్గం లేదు. కొద్దిపాటి వర్షానికే నీరు నిలిచిపోతుంది. ఇటీవల స్థానికులందరం కలిసి మురుగు కాలువలు సైతం తవ్వించడంతో కొంత నీరు మాత్రమే పోయింది. అధికారులు స్పందించి ఖాళీ స్థలాలను మెరక చేయించటం కానీ నీటిని తోడించటం కానీ చేయాలి

– మధు, స్థానికుడు, దావు బుచ్చయ్యకాలనీ

ఎస్‌హెచ్‌జీ సభ్యులకు రుణాలు మంజూరు చేయాలి



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న సునీత లక్ష్మి తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): అర్హులైన స్వయం సహాయక సంఘ సభ్యుల(ఎస్‌హెచ్‌జీ)కు లఖ్‌పతి దీదీ రుణాలను మంజూరు చేయాలని డీఆర్డీఏ డీపీఎం సునీత లక్ష్మి ఆదేశించారు. ఇండియన్ బ్యాంక్ విజయవాడ జోన్ ఆధ్వర్యంలో విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గురువారం ఎస్‌హెచ్‌జీ, లఖ్‌పతి దీదీ మాన్సూన్ క్యాంపెయిన్ జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె ఇండియన్ బ్యాంక్ గ్రామీణ బ్యాంకింగ్ విభాగం జనరల్ మేనేజర్ వీ చంద్రశేఖరన్, ఫీల్డ్ జనరల్ మేనేజర్ (హైదరాబాద్) జీ రాజేశ్వరరెడ్డి, అమరావతి జోనల్ మేనేజర్ డీ సూర్యనారాయణ మూర్తి, విజయవాడ జోనల్ మేనేజర్ ఎం రాజేష్‌లతో కలిసి ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల రుణాలకు సంబంధించి స్వయం సహాయక సంఘ సభ్యులకు రూ.330 కోట్ల మేరకు చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఇండియన్ బ్యాంక్ అధికారులను, సిబ్బందిని అభినందించారు. సమావేశంలో ఎంఎం పాడు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎస్ రామమూర్తి, అమరావతి డెప్యూటీ జోనల్ మేనేజర్ కె.కృష్ణమోహన్, విజయవాడ డెప్యూటీ జోనల్ మేనేజర్ దాసరి రామారావు, విజయవాడ మైక్రోసెట్ బ్రాంచి మేనేజర్ బి.నాగు, విజయవాడ జోనల్ కార్యాలయ బృందం, విజయవాడ జోన్ బ్రాంచి మేనేజర్లు పాల్గొన్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సహకరించాలి

పటమట(విజయవాడతూర్పు): వీఎంసీ, పోలీస్ డిపార్ట్‌మెంట్ సమన్వయంతోనే నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్య పరిష్కారం సాధ్యమవుతుందని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలో విజయవాడ కమిషనరేట్ ట్రాఫిక్ ఏడీసీపీ ఏవీఎల్ ప్రసన్న ఆధ్వర్యంలో ఆయన బృందం వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్రను గురువారం కలిసి ట్రాఫిక్ అవరోధాలు, తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. నగరంలోని కృష్ణలంక, గవర్నర్‌పేట, గాంధీనగర్, పటమటలో రహదారుల ఆక్రమణలు పెరిగాయని, వీటిని నిరోధించాలన్నారు. బెంజిసర్కిల్ వద్ద మార్గ్ కృష్ణయ్య హోటల్ వద్ద ఉన్న డివైడర్ కటింగ్ ఎన్టీయార్ సర్కిల్ వైపునకు మార్చాలని ప్రతిపాదించారు. కనకదుర్గ వారధి వద్ద ఉన్న ఐలాండ్స్ నిడివి తగ్గించటం, బెంజిసర్కిల్ వద్ద ప్రస్తుతం ఉన్న ఫ్రీలెఫ్ట్ సర్వీస్ రోడ్డులోకి మార్చాలని కమిషనర్‌ను కోరారు. దీనిపై క్షేత్రస్థాయి పరిశీలన చేసి చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. కమిషనరేట్ ట్రాఫిక్ ఏసీపీ, సీఐలు, ఎస్సైలు, వీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం, ఇంజినీరింగ్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య కార్యక్రమాల అమలులో ప్రగతి సాధించాలి



లబ్బీపేట(విజయవాడతూర్పు): జిల్లాలో ఆరోగ్య కార్యక్రమాల అమలులో ప్రగతి సాధించి, లక్ష్యాలు చేరుకోవాలని ట్రైనీ కలెక్టర్ శుభమ్ నొక్వాల్ ఆదేశించారు. ఆయన గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ప్రోగ్రామ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ శాఖలోని వివిధ విభాగాల పని విధానం, కార్యక్రమాల అమలు, లక్ష్యాలు, ప్రగతి వంటి అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని ఆరోగ్య కార్యక్రమాలు జిల్లాలో అమలవుతున్న తీరును ఆయనకు వివరించారు. కార్యక్రమంలో డీఎల్‌టీఓ డాక్టర్ జె.ఉషారాణి, డీఐఓ డాక్టర్ అమృత, డెప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఇందుమతి, ఆర్‌బీఎస్‌కే అధికారి డాక్టర్ మాధవీనాయుడు, డీఎంఓ డాక్టర్ మోతీబాబు, డాక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అధికారులతో డీఎంహెచ్‌ఓ సుహాసిని సమీక్ష నిర్వహించారు. అంటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

కార్డియో-పల్మనరీపై శిక్షణ

పాయకాపురం(విజయవాడరూరల్): ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థలో ఆయూష్ ఎస్‌ఆర్‌ఐ ఎల్‌ఈపీఎల్ హెల్త్‌కేర్ సహకారంతో సిబ్బందికి బేసిక్ లైఫ్ సపోర్ట్(బీఎస్ఎల్) శిక్షణా కార్యక్రమం గురువారం జరిగింది. డాక్టర్ జెఎస్ తరుణ్‌చౌదరి మాట్లాడుతూ.. అత్యవసర సమయంలో ప్రతి స్పందన నైపుణ్యాలను పెంపొందించడం కోసం శిక్షణ ఇచ్చామన్నారు. ఆర్ఏఆర్ఐ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు బేసిక్ సపోర్ట్/బీఎల్ఎస్ శిక్షణ కీలకమైన ప్రాముఖ్యతను వివరించారు. రీసెర్చ్ ఆఫీసర్ డాక్టర్ ఏజెవి సాయిప్రసాద్ సంసిద్ధత, క్లిష్ట పరిస్థితుల్లో సమయానుకూల నిర్ణయ విలువను తెలియజేశారు.

వైభవంగా సాగుతున్న సంగీతోత్సవాలు

విజయవాడకల్చరల్: కృష్ణమాచార్యులు కళాపీఠం ఆధ్వర్యంలో సంగీత విద్వాన్‌మణి శ్రీమాన్ ఎస్‌సీహెచ్ కృష్ణమాచార్యులు శత జయంతి సందర్భంగా శివరామ కృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న సంగీతోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్వాంసులు వాగ్గేయకార కృతులను ఆలపిస్తున్నారు. గురువారం నాటి కార్యక్రమాలు పత్రి అన్నపూర్ణ కచేరీతో ప్రారంభమయ్యాయి. ఎస్.వనమాలి, ఎస్.మాధవ్ వేణుగానంతో అలరించారు. డాక్టర్ వేమూరి ఓజస్వి, పాల్ఘాట్ రాఘవ కృష్ణ, ముట్నూరి జలజాక్షి, ఎంఎస్ మూర్తి, పారుపల్లి సృజన తదితరులు వాగ్గేయకార కృతులను ఆలపించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న శతావధాని అవధానుల మురళి కృష్ణమాచార్యులు సాహితీ వైభవం అంశంగా ప్రసంగించారు. కృష్ణమాచార్యులు బహుముఖ ప్రతిభాశాలిగా అభివర్ణించారు. తెలుగు, సంస్కృతంలోనూ రచనలు చేశారని, ఆయన సేవలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

ఎస్‌ఆర్‌ఆర్‌లో క్లైమేట్ యాక్షన్ క్యాంపెయిన్



ఎస్‌ఆర్‌ఆర్‌లో మాట్లాడుతున్న వక్తలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం అంతర్జాతీయ రెడ్‌క్రాస్ కమిటీ ఆధ్వర్యాన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అధ్యక్షతన క్లైమేట్ యాక్షన్ క్యాంపెయిన్ జరిగింది. ఈ సందర్భంగా ఏపీ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రధాన కార్యదర్శి, సీఈఓ ఏకే పరిడా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు ప్రతి విషయాన్ని శ్రద్ధగా తెలుసుకుని, సమాజంలో తమ పాత్రను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. రెడ్‌క్రాస్ యాప్ గురించి వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ వాతావరణ మార్పుల గురించి విద్యార్థులకు వివరించేందుకు కార్యక్రమం ఏర్పాటు చేసిన రెడ్‌క్రాస్ కమిటీను అభినందించారు. విద్యార్థి దశ నుంచే పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని సూచించారు. వాతావరణంలో మార్పులను అధ్యాపకుడు బాలసుబ్రహ్మణ్యం, శ్రీనివాసరెడ్డి వివరించారు.

వర్గీకరణ ప్రక్రియను చంద్రబాబు ప్రభుత్వం ప్రారంభించాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వమే తక్షణమే ఆ ప్రక్రియను ప్రారంభించాలని రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. విజయవాడలోని కేఎల్ రావు భవన్‌లో ఇంటలెక్చువల్ ఫోరమ్ ఫర్ మాదిగాస్(ఇన్ఫార్మ్) రౌండ్ టేబుల్ సమావేశం గురువారం జరిగింది. సమావేశంలో తెలుగు రాష్ట్రాల నుంచి మాదిగ విద్యావంతులు, మేధావులు పాల్గొన్నారు. సమావేశంలో ఇన్ఫార్మ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు గెద్దం బాపిరాజు, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక కార్యదర్శి పి.కృపాకర్ మాదిగ మాట్లాడుతూ.. వర్గీకరణపై చంద్రబాబు ప్రభుత్వం చట్టం చేయాలన్నారు. తెలంగాణలో చేసిన విధంగా జ్యూడిషియల్ కమిషన్‌ను నియమించాలని కోరారు. రాష్ట్రం యూనిట్‌గా వర్గీకరణ అమలు చేయాలని కోరారు. సమావేశంలో ఇన్ఫార్మ్ స్టేట్ ప్రెసిడెంట్ మట్టా విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ముత్తయ్య, ప్రొఫెసర్ పెద్దింటి నెహేమియా, రాంబాబు, బుట్టి రామచంద్రుడు, సంజయ్, ముప్పిడి సుబ్బారాయుడు మట్టా ప్రభాత్, ప్రొఫెసర్ రవిబాబు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జూబిలీ ఇండోర్ సబ్ స్టేషన్, 11 కేవీ డోర్నకల్ రోడ్డు ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు టౌన్ ఈఈ రవీంద్రబాబు గురువారం తెలిపారు.

సత్యనారాయణపురం ఫీడర్ పరిధిలో

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యుత్ వైర్ల మరమ్మతుల దృష్ట్యా ముత్యాలంపాడు సబ్‌స్టేషన్ సత్యనారాయణపురం ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ పి.రవీంద్రబాబు గురువారం తెలిపారు.

రేపు షిర్డీ సాయి దివ్యచరితం నృత్య రూపకం ప్రదర్శన

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 6.30 గంటలకు మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో నాట్యాచారిణి ఎస్వీ శివకుమారి బృందంచే శ్రీ షిర్డీ సాయి దివ్యచరితం కూచిపూడి నృత్య రూపక ప్రదర్శన నిర్వహిస్తున్నామని కళాపీఠం అధ్యక్షుడు పి.లక్ష్మణరావు గురువారం తెలిపారు. భక్తులు ఉచితంగానే ఈ ప్రదర్శనను తిలకించవచ్చునని పేర్కొన్నారు.

క్యాన్సర్‌ను ముందుగా గుర్తిస్తే నివారణ సాధ్యం



పాయకాపురం(విజయవాడరూరల్): మహిళలు రొమ్ముక్యాన్సర్ వ్యాధిని ముందుగా గుర్తిస్తే నివారణ సాధ్యమేనని ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్(ఇన్‌చార్జి) డాక్టర్ బి.వెంకటేశ్వర్లు అన్నారు. న్యూ రాజీవ్‌నగర్‌లోని ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థలో 9వ ఆయుర్వేద దిన వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా హెచ్‌సీజీ క్యాన్సర్ సెంటర్ సహకారంతో 50 మంది రోగులకు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. హెచ్‌సీజీ క్యాన్సర్ సెంటర్ డాక్టర్ ఎ.సత్యశ్రీనివాస్, కన్సల్టెంట్, మెడికల్ అంకాలజిస్ట్, సంస్థ సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్ డాక్టర్ సాయి ప్రసాద్, డాక్టర్ అనుమోల్ క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆపన్నహస్తం



చీరలు అందజేస్తున్న రెవ.జోసఫ్ తదితరులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడ సెంట్రల్): వరద బాధితులకు ఆపన్నహస్తం అందించేందుకు దాతలు ముందుకు రావాలని తెలుగు బాపిస్ట్ చర్చ్‌స్ జాతీయ ప్రధాన కార్యదర్శి, రెవ. మంగలపూడి జోసఫ్ పిలుపునిచ్చారు. శారీదివా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సింగ్‌నగర్‌లోని వరద బాధితులకు గురువారం చీరలు, నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఆర్గనైజేషన్ సభ్యులు స్మిత, గ్రేస్ రోరాలినా తదితరులు పాల్గొన్నారు.

ఆపన్నులకు చేయూతను అందించడమే 'ఆసరా' స్వచ్ఛంద సేవా సంస్థ(విశాఖ) లక్ష్యమని ఆ సంస్థ అధ్యక్షుడు గోకేడ సూర్యనారాయణ అన్నారు. స్థానిక సింగ్‌నగర్ సమీపంలోని ఆంధ్రప్రభ కాలనీ లండన్ కిడ్స్ పాఠశాలలో గురువారం వరద బాధితుల సహాయ శిబిరం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడైనా ప్రకృతి విపత్తులు సంభవించినా ఆసరా సేవా సంస్థ తరపున సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యక్షుడు ఆర్.ఎస్.రావు, సంస్థ సభ్యులు కోంద్రు ఏసు, సీనియర్ జర్నలిస్ట్ మోదుమూడి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



గవర్నర్‌పేటలో అపార్ట్‌మెంట్ వాసులకు అవగాహన కల్పిస్తున్న సీఐ నాగమురళి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని గవర్నర్‌పేట సీఐ అడపా నాగమురళి సూచించారు. నగర పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు గురువారం గవర్నర్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలోని గోపాల కృష్ణయ్య వీధి నందు గల శ్రీ లక్ష్మీసాయి రెసిడెన్సీ వాసులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోలీసు సిబ్బంది అపార్ట్‌మెంట్ వాసులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న సీఐ మాట్లాడుతూ వాట్సాప్, టెలిగ్రామ్ వంటి వాటిలో ట్రేడింగ్ పేరుతో వచ్చే మెసేజ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏదైనా సమస్య వస్తే 100 నంబర్‌కు కాల్ చేయాలన్నారు. అవగాహన సదస్సులో డబ్ల్యూఎంఎస్‌కేలు పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

పటమట(విజయవాడతూర్పు): దీపావళి సందర్భంగా నగరంలో బాణసంచా దుకాణాల ఏర్పాటు చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నగరపాలకసంస్థ కమిషనర్ ధ్యానచంద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29వ తేదీ నుంచి 31వ తేదీ వరకు మూడు రోజుల పాటు దీపావళి బాణసంచా విక్రయించుకునేందుకు విద్యాధరపురం లేబర్ కాలనీలో స్టేడియంలో, అజిత్‌సింగ్‌నగర్ మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో వీఎంసీ స్టాల్లను ఏర్పాటు చేస్తోందన్నారు. ఆయా ప్రాంతాల్లో విక్రయ స్టాల్స్ ఏర్పాటు చేసుకునేందుకు విక్రయదారులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ మేరకు వీఎంసీ ఎస్టేట్స్ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీ నుంచి 28వ తేదీ వరకు మధ్యాహ్నం రెండు గంటల వరకు సత్యనారాయణపురం ఏకేటీపీ స్కూల్ వద్ద ఉన్న సర్కిల్–2 కార్యాలయంలో దరఖాస్తులను విక్రయిస్తున్నామన్నారు. అక్టోబర్ 28వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు తర్వాత దరఖాస్తుదారుల సమక్షంలో లాటరీ ద్వారా స్టాల్స్ కేటాయిస్తామని తెలిపారు.

అలరించిన సంగీత కచేరి



సంగీత కచేరి నిర్వహిస్తున్న తేజస్విని

విజయవాడకల్చరల్: స్వరఝరి సంగీత సంస్థ ఆధ్వర్యంలో నెల వారీ కార్యక్రమంలో భాగంగా గురువారం గాంధీనగర్‌లోని సంస్థ కార్యాలయంలో యువ సంగీత కళాకారిణి లంకా తేజస్విని నిర్వహించిన సంగీత కచేరి ఆకట్టుకుంది. ముత్తుస్వామి దీక్షితార్ మహాగణపతింతో ప్రారంభించి త్యాగరాజస్వామి కీర్తన మనసు నిల్పి శక్తి, సుబ్బరాయ శాస్త్రి కీర్తన జనని నినువిన, పలు కీర్తనలను మధురంగా ఆలపించారు. వయోలిన్‌పై అంబటిపూడి కామాక్షి, బి.సురేష్‌బాబు మృదంగంపై, ఫణిభూషణ్ ఘటంపై సహకరించారు. సంస్థ ప్రధాన కార్యదర్శి మోదుమూడి సుధాకర్ మాట్లాడుతూ 36 సంవత్సరాలుగా సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంగీత రంగానికి చెందిన విద్వాంసులు అంజనా సుధాకర్, వేమూరి విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

'క' చిత్రం ట్రైలర్ విడుదల



మీడియాతో మాట్లాడుతున్న హీరో కిరణ్ అబ్బవరం, చిత్ర యూనిట్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ నగరంలో 'క' చిత్రం ట్రైలర్ రిలీజ్ ఈవెంట్ కోలాహలంగా సాగింది. గాంధీనగర్‌లోని రాజ్ – యువరాజ్ థియేటర్‌లో హీరో కిరణ్ అబ్బవరం నటించిన 'క' చిత్రం ట్రైలర్ రిలీజ్ ఈవెంట్ గురువారం జరిగింది. హీరో కిరణ్ అబ్బవరం హీరోయిన్ నయన్ సారిక, దర్శకుడు సుజిత్, నిర్మాత చింత గోపాలకృష్ణరెడ్డితో కలిసి ట్రైలర్‌ను లాంఛనంగా రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ.. ఈనెల 31వ తేదీన దీపావళి పండుగ సందర్భంగా తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ భాషలలో 'క' చిత్రాన్ని విడుదల చేస్తున్నామన్నారు. 1970 బ్యాక్ డ్రాప్‌లో జరిగిన ఒక కథ ఆధారంగా ఈ చిత్రాన్ని దర్శక ద్వయం సుజిత్, సందీప్ అద్భుతంగా తెరకెక్కించారన్నారు. నయన్ సారిక మాట్లాడుతూ తెలుగులో తాను నటిస్తున్న మొదటి చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలని కోరారు.